క్లుప్తంగా

సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలి

కర్నూలు(సెంట్రల్): వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే బ్యాంకుల నుంచి రైతులకు పంటల పెట్టుబడికి అవసరమైన రుణాలను ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మోదీ హయాంలో దేశ ప్రతిష్ట పెరిగింది

కర్నూలు కల్చరల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరిపాలనలో దేశం ప్రతిష్ట, ఖ్యాతి పెరిగిందని బీజేపీ అధికార ప్రతినిధి సాయి ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ ప్రజలు మూడోసారి మోదీ పాలన కోరుకొని బీజేపీకి పట్టం కట్టారన్నారు. ఏపీలో బీజేపీ బలం పుంజుకుంటుందన్నారు. మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న మోదీ నాయకత్వంలో దేశం మరింత పురోగమిస్తుందనే ఆశాభావంతో దేశ ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు.

మ్యాన్‌హోల్‌ను మూయించండి


తెరిచి వున్న మ్యాన్‌హోల్‌ను చూపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 11వ వార్డు ఎర్రబురుజులో వినాయక గుడి వెనుక వైపు ఉన్న మ్యాన్‌హోళ్లను మూయించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గసభ్యుడు షేక్ మహ్మద్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం బృందం మ్యాన్‌హోళ్లతో ఇబ్బంది పడే ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తెరచి ఉండడంతో ప్రమాదంగా మారాయన్నారు. మ్యాన్‌హోళ్లను మూయకపోతే చిన్నారులు అందులో పడి ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌డీ ఖాజాపాషా, రవికుమార్ పాల్గొన్నారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


స్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారి


హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు. మరికొందరు భక్తులు ఆలయ మెట్లకు పసుపు కుంకుమ పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆదోని కళాకారులకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్

ఆదోని అర్బన్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక కళా సౌజన్యంతో గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదోనికి చెందిన సోదరులకు శ్రీకాంత్ (చిత్ర కళాకారుడు), అశోక్ శ్రీనాథ్ (సూక్ష్మ కళాకారుడు)కి బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్, ప్రముఖుల చేతుల మీదుగా బంగారు నంది అవార్డులను ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ.. తమ ప్రతిభకు అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు.నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మంత్రాలయం: మంత్రాలయం నది తీరాన బండరాళ్ల వద్ద ఆదివారం గుర్తు తెలియని మగ శవం పడిఉంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపీనాథ్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మృతుడిని గుర్తు పట్టడానికి ఆయన దగ్గర ఎలాంటి ఆధారాలు గానీ, ఐడీ కార్డులు గానీ లేవన్నారు. ఎర్ర పంచ, ఎర్రని డ్రాయరు, ఎర్రని చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

- కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటా
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 16 వార్డులోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు అందరూ ధైర్యంగా ఉండాలని, అందరికీ అనునిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానన్ని భరోసా నిచ్చారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల చెంతకే పాలన అందించడంతో పాటు, రాష్ట్రంలో ప్రతి గడప గడపకూసంక్షేమ ఫలాలు అందించిందని చెప్పారు. గోరుకల్లు రిజర్వాయర్ సామర్థ్యం పెంచి పాణ్యంతో పాటు బనగానపల్లె ప్రజలకు సాగు, తాగు నీరు అందించామని, కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 8 ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంక్‌లను మంజూరు చేశామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో వందల కిల్లోమీటర్లు రోడ్లు, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ రోడ్లు మరమ్మతులు చేయించామని, సోలార్ నిధులతో ఓర్వకల్లు గ్రామం అభివృద్ధి, పాణ్యంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు ఇటు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం తప్పయితే తనను క్షమించాలని కోరారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మారు

వైఎస్సార్‌సీపీకి ఎన్నికల్లో 40శాతం ఓట్లు వచ్చాయని మాజీ ఎమ్మెల్యే కాటసాని అన్నారు. తాము నష్టపోయింది ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, ఇసుక, మద్యం వల్లేనని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టంపై టీడీపీ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలోనే ఈ చట్టంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని తెలిసిందని చెప్పారు. టీడీపీ మేనిఫెస్టో ప్రజల్ని ఆకర్షించి ఉండొచ్చని, వైఎస్సార్‌సీపీ కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు టీడీపీ అమలు చేస్తుందని ప్రజలు ఆశ పడి ఉండవచ్చన్నారు. టీడీపీ ఇచ్చిన హామీలు నిలుపుకుని, ప్రజల బాగు కోసం పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించకుండా ఎవరు తప్పు చేసినా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కల్లూరు అర్బన్ పరిధిలో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు


పిల్లలకు బహుమతులను ప్రదానం చేస్తున్న గ్రంథాలయాధికారి

ఓర్వకల్లు: గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నన్నూరు శాఖ గ్రంథాలయాధికారి కౌసల్య అన్నారు. ఏప్రిల్ 29వ తేదీ నుంచి జరిగిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కౌసల్య మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు బయట తిరగకుండా, వారిలో విజ్ఞానాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో జిల్లా గ్రంథాలయ సంస్థ వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించిందని తెలిపారు. 40 రోజుల పాటు నిర్వహించిన శిబిరాల్లో విద్యార్థులకు పుస్తక పఠనం నేర్పించడం, కథలు చెప్పడం, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులు సెలవు రోజుల్లో గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, జగన్నాథరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కరాటే సాధనతో మానసిక వికాసం


పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శమంతకమణి

కర్నూలు (టౌన్) : కరాటే సాధన వల్ల విద్యార్థినీ, విద్యార్థులకు మానసిక వికాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని మాజీ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ శమంతకమణి అన్నారు. ఆదివారం స్థానిక యునైటెడ్ క్లబ్ హాలులో అంతర్ జిల్లా కరాటే పోటీలను నిర్వహించారు. గ్రాండ్ మాస్టర్ ఆరిఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు తమ దైనందిన జీవితంలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. చదువుతో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించాలన్నారు. తమ వంతుగా క్రీడాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సయ్యద్ ఖలీద్, మాజీ డీఎస్పీ హుస్సేన్ పీరా పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): శిక్షణ ద్వారా క్రీడల్లో రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు అన్నారు. ఆదివారం స్థానిక దామోదరం సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శిలంబం (కర్రసాము) వేసవి క్రీడా ముగింపు శిక్షణ శిబిరం నిర్వహించారు. డీఎస్‌డీఓ మాట్లాడుతూ శిలంబం అనే కర్రసాము క్రీడ పురాతనమైనదన్నారు. ఇటువంటి క్రీడలో శిక్షణకు పంపించిన తల్లిదండ్రులను అభినందనలు తెలిపారు. అనంతరం శిబిరానికి వచ్చిన చిన్నారులకు అల్పాహారం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చెట్టంతా పూలే !


ఇనగండ్ల రోడ్డులో నిండా పూలతో దర్శనమిస్తున్న చెట్టు

సి.బెళగల్: చెట్టుకు ఆకులే ఆధారం. అలాంటిది ఒక చెట్టుకు ఆకులన్నీ రాలిపోయినా నిండా పూలు పూయడంతో చూపరులను ఆకర్షిస్తోంది. సి.బెళగల్ మండలంలోని ఇనగండ్ల గ్రామానికి వెళ్లే దారిలో సుంకేశ్వరి చెట్టుకు ఆకులన్నీ రాలిపోగా ఎర్రని పూలు చెట్ల నిండా విరబూయడంతో అటుగా వెళ్లే వారిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నాయి. అలాగే చెట్టు పక్కనున్న వాటికి మాత్రం పచ్చని ఆకులు, ఎర్రటి పూలతో కనువిందు చేస్తున్నాయి.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు


ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర

కర్నూలు కల్చరల్: నగరంలోని భగీరథ కాంప్లెక్స్‌లో వెలసిన పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞం నిర్వహించారు. హరినామ సంకీర్తనలతో నృత్యాలు చేశారు. భక్త ప్రహ్లాద స్కూల్ విద్యార్థులచే నృసింహ, భక్త ధ్రువ నాటికల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. భగవద్గీత జీవితంలోని ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

21న ఎల్లార్తి దర్గాలకు టెండరు


ఎల్లార్తి దర్గా ముఖద్వారం

హొళగుంద: ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల ఏడాది నిర్వహణకు ఈ నెల 21న టెండరు నిర్వహిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ రెండు దర్గాలు, 38 రూములు, చందాపట్టి, చర్మ సేకరణ, చక్కెర, హేర్ కటింగ్ తదితర వాటికి సీల్డ్ టెండరును జూన్ 7 నుంచి ఈ నెల 21వ తేది వరకు ఆహ్వానించారు. విజయవాడలో జరిగే సీల్డ్ టెండర్ ఓపెన్‌లో అత్యధికంగా కోట్ చేసిన వారు వేలం దక్కించుకోనున్నారు. వారికి వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్వహణ గడువును తెలిపి దర్గాలను స్వాధీనం చేస్తారు. కాగా ఈ దర్గాలను 2014లో వక్ఫ్ బోర్డు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో నుంచి స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దర్గాల నుంచి వక్ఫ్ బోర్డుకు రూ. కోట్లలో ఆదాయం వచ్చింది. ఇంత ఆదాయం వచ్చినా తాగునీరు, గదులు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు కరువయ్యాయని భక్తులు ఆరోపిస్తున్నారు.

బీజేపీ యువమోర్చా నేతల సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ యువ మోర్చా నాయకులు

కర్నూలు(హాస్పిటల్): భారత ప్రధానిగా నరేంద్రమోదీ మూడో సారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయం వద్ద యువమోర్చా కర్నూలు జిల్లా అధ్యక్షులు జంపాల కేశవరామ్ చౌదరి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి వచ్చి మిఠాయిలు పంచుకుని బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బీజేపీ సీనియర్ నాయకుడు సందడి సుధాకర్, సారాయి రంగస్వామి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబిలి కాశీ విశ్వనాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర రావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు మాలతి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవికి రాజీనామా

పెద్దకడబూరు: ఆంధ్రప్రదేశ్ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ పదవికి పర్లప్ప గారి భాగ్యమ్మ ఆదివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఓటమికి నైతిక బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజీనామా లేఖను ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా తాను, తన భర్త (మాజీ ఎంపీపీ) రఘురాముడు వైఎస్సార్‌సీపీ వెంట ఉండి పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడకుండా గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కలసికట్టుగా శ్రమిద్దామన్నారు. నాలుగవ సారి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించినందుకు మంత్రాలయం నియోజకవర్గం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం


పాఠశాలకు సరుకులు అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు సిటీ: ఎస్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం స్థానిక సలాంఖాన్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ఎస్‌టీయూ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. 1946, మే, 17న ఎస్టీయూ ఆవిర్భవించిందన్నారు. నాటి త్యాగాల ఫలితమే నేడు ఉపాధ్యాయులు అనేక సౌలభ్యాలు పొందుతున్నారన్నారు. పీఆర్‌సీ, అప్రెంటిషిప్ రద్దు వంటి ఎన్నో సౌలభ్యాలు తమ సంఘం పోరాట ఫలితమేనని అన్నారు. అనంతరం నగర శివారులోని అమ్మ అంధుల పాఠశాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి టి.కె జనార్దన్, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు సుంకన్న, రాష్ట్ర పూర్వ కార్యదర్శి షఫీ, సిటీ విభాగం నాయకులు రాముడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నహరివాణంలో ఇరువర్గాల ఘర్షణ

ఆదోని టౌన్: ఆదోని మండలం చిన్నహరివాణం గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఈశ్వరమ్మ, వీరభద్రారెడ్డి, వారి తనయుడు వీరేష్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గిరిరెడ్డి, ఆనందరాజ్, శాంతరాజ్, నరసన్నతో పాటు మరి కొంతమంది ఆదివారం దాడులు చేశారు. గాయపడిన వీరభద్రారెడ్డి, ఈశ్వరమ్మ, వీరేష్‌రెడ్డిలను వారి బంధువులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బాధితుడు విలేకరులకు తెలిపిన వివరాల మేరకు.. చిన్నహరివాణం గ్రామంలో కొంతకాలంగా శివశంకర్‌రెడ్డి, వీరేష్‌రెడ్డి కుటుంబాల మధ్య ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. అయితే ఆదివారం శివశంకర్ రెడ్డి తన అనుచరులతో ఏకంగా వీరేష్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించారు. దాడిని అడ్డుకోబోయిన అతని తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, వీరభద్రారెడ్డిలపై దాడి చేశారు. శివశంకర్‌రెడ్డి చేసిన దాడిలో తల్లి, తండ్రి, కొడుకులకు రక్తగాయాలయ్యాయి. 'ప్రభుత్వం మాది. మేము చెప్పిన విధంగా వినాలి, లేదంటే పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరించినట్లు బాధితుడు వీరేష్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. తమకు సంబంధించిన స్థలాన్ని ఇప్పించాలని అభ్యర్థించారు.

నృత్యప్రదర్శనలు తరచూ నిర్వహించాలి


మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షుడు నారాయణస్వామి

కర్నూలు కల్చరల్: జిల్లాలో తరచూ నృత్య ప్రదర్శనలు నిర్వహించాల్సిన అవసరం ఉందని కర్నూలు డిస్ట్రిక్ట్ డ్యాన్స్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నారాయణ స్వామి, గౌరవ సలహాదారు డాక్టర్ భార్గవ్ అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో అసోసియేషన్ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ డ్యాన్స్ మాస్టర్లు కల్చరల్ ప్రోగ్రామ్స్ అన్నింటిలో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. వారివారి శిష్య బృందాలు పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి షాకీర్, జాయింట్ సెక్రటరీ అఫ్జల్, కోశాధికారి మధు, సభ్యులు సుదీర్, నాగరాజు, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణతో నాణ్యమైన దిగుబడులు


ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ ఇస్తున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు

- ఇన్‌పుట్ డీలర్ల శిక్షణ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటల సాగులో చీడపీడల నివారణ ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. ఆదివారం వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ కార్యాలయంలో దేశీ డిప్లోమ కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. విత్తన శుద్ధి, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై ఇన్‌పుట్ డీలర్లు అవగాహన పెంచుకొని రైతులను చైతన్య పరచాలని కోరారు.జిల్లాలో ప్రధానంగా పత్తి, వరి, వేరుశనగ, కంది, మొక్కజొన్న తదితర పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్ల.. వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. మొలకెత్తిన 20–30 రోజుల వరకు పంటలకు చీడపీడల బెడదను నివారించుకోవడానికి విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. దీని వల్ల విత్తనం, భూమి నుంచి సోకే చీడపీడలను అదుపు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గుతుందని, పురుగులు, తెగుళ్లను అదుపులో ఉంచవచ్చని పేర్కొన్నారు. రైతులు రసాయన ఎరువులను సూటి ఎరువుల రూపంలో వేయటం వల్ల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. విశ్రాంత జేడీఏ, దేశీ కోర్సు సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... వివిధ పంటల సాగులో చీడపీడల నివారణ కోసమే రైతులు ఎక్కువ ఖర్చు పెడుతుంటారని, దీనిని తగ్గించుకోవాలంటే సస్య రక్షణ పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

ఆదోని అర్బన్: ఆదోనిలోని మంగళ ఆంజనేయస్వామి ఆలయంలో ఎన్నో సంవత్సరాలుగా స్వామివారికి సేవలు చేస్తున్న కళాకారులను ఆర్ఎస్ఎస్ సభ్యులు టైలర్ రమేష్, దేవస్థాన అధ్యక్షులు గౌడ్ ఈరన్న ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక ఆలయ ప్రాంగణంలో లలిత కళా సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ జి.నల్లారెడ్డి, గౌడ్ ఈరన్న, ప్రముఖ సంగీత హార్మోనిస్టు ఉరుకుందప్పలను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాన్ని సుందరంగా నిర్మించిన కళాకారులు ప్రతిభ వెలకట్టలేనిదన్నారు. వారు నిర్మించిన కళ అశాశ్వతమైనదని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, దేవాలయ సభ్యులు ఓంకార్‌గౌడ్, ఈరన్న, రమేష్, మల్లప్ప, కృష్ణ, లక్ష్మయ్య, నాగయ్య, రాముడు, రాము తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో 'కార్పొరేట్' సత్తా


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యా సంస్థల డీజీఎం గోవర్ధన్ రెడ్డి తదితరులు


ఎస్.ఆర్ కాలేజీ విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ జోనల్ ఇన్‌చార్జ్ రఘువీర్, తదితరులు

     
కె.హర్షవర్ధన్, కె.శివ నారాయణ, పి.ప్రణీత్ రెడ్డి, డి.నోయల్ తనయ్, ఎ.దీపక్ కుమార్,బి.సుజిత్ కుమార్

కర్నూలు సిటీ: జాతీయ స్థాయిలోని ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రాఖ్యాతిగాంచిన సాంకేతిక విద్యను అందించే కాలేజీల్లో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు నిర్వహించిన జాతీయ స్థాయి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో కార్పొరేట్ కాలేజీలు సత్తా చాటాయి.

- శ్రీచైతన్య జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ కాలేజీ ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆ కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమయంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షల్లో కె.హర్షవర్ధన్ 42వ ర్యాంకు, కె.శివ నారాయణ 51, పి.ప్రణీత్ రెడ్డి 345, డి.నోయల్ తనయ్ 1,538, ఎ.దీపక్ కుమార్ 6938, బి.సుజిత్ కుమార్ 7,609,, పి.ఉమా లికేష్ 15,678వ ర్యాంకు, సాధించారన్నారు. వీరితో పాటు చాలా మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారన్నారు. కార్యక్రమంలో ఆ కాలేజీ డీన్ సరళ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.
- నారాయణ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యా సంస్థల డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి తెలిపారు. వివిధ క్యాటగిరిల్లో త్రిష 76వ ర్యాంకు, టి.సర్వజిత్ 251, షెహద్ అలీఖాన్ 278, సాకేత్ సాయి మణికంఠ 1,237, టి.శ్రీహిత 1247, ఎమ్. రాజశేఖర్ 2797, ఎం.లాస్య 1801వ ర్యాంకులు సాధించారన్నారు. వీరితో పాటు 500లోపు ముగ్గురు, 2 వేలలోపు ఏడుగురు, 5 వేలలోపు 15 మంది ర్యాంకులు సాధించారని చెప్పారు. ర్యాంకులు సాధించి విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డీన్స్ ఆంజనేయ రెడ్డి, విశ్వనాథరెడ్డి, ప్రిన్సిపాల్స్ వేణుగోపాల్ రెడ్డి, జయరామిరెడ్డి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

– జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఎస్.ఆర్ కాలేజీకి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ కాలేజీ జోనల్ ఇన్‌చార్జ్ టి.రఘువీర్ తెలిపారు. కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆల్ ఇండియా లెవెల్‌లో పి.రాకేష్ కుమార్ 36వ ర్యాంకు, వద్దే వచస్ రెడ్డి 127, మల్లు నాయక్ 1,186, ఎస్.బద్రీనాథ్ రెడ్డి 3,639, వై.మినిత్ కుమార్ 5,086, ఎం.చరణ్ తేజ్ 5,988వ ర్యాంకు సాధించారని చెప్పారు. వీరితో పాటు మరి కొంత మంది ర్యాంకు సాధించారన్నారు. తమ సంస్థల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పిల్లలను చక్కని ప్రణాళికతో బోధన చేయడం, రెగ్యులర్‌గా పర్యవేక్షణ చేయడంతోనే ఉత్తమ ఫలితాలు వస్తున్నాయన్నారు. కాలేజీ అధినేత వరదా రెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, జీఎం రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

మహానందీశ్వరుడికి అభిషేకార్చనలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్లకు రుద్రాభిషేకం, కుంకుమార్చనలు చేపట్టారు. స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం నిర్వహించగా.. పలు ప్రాంతాల భక్తులు వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు.